సాక్షి
తిరుపతి

ఆదివారం । 16 । ఫిబ్రవరి । 2025



మద్మిడాడీ త్వరగా వచ్చేయండి!
పెళ్లకూరు మండలం దొడ్లవారిమిట్ట వద్ద శనివారం ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. - 8లో



కొనసాగుతున్న వేతన వెతలు!
ఎస్వీయూలో ఉద్యోగులు ఆరు నెలల నుంచి సకాలంలో సక్రమంగా వేతనాలు అందక తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. - 8లో



ఎవరే అతగాడు?
తనను ఎవరో చంపేందుకు వస్తున్నారంటూ పీలేరు నుంచి తిరుపతికి వస్తున్న కర్ణాటక బస్సులో ఓ వ్యక్తి హల్ చల్ చేశాడు. - 8లో

న్యూస్‌రీల్

పరిసరాల శుభ్రతే లక్ష్యం



ప్రతిజ్ఞ చేయిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేందర్‌రెడ్డి

తిరుపతి అర్బన్: కలెక్టరేట్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేందర్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. కలెక్టరేట్‌లో ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా కలెక్టరేట్ ఉద్యోగులతో దేవేందర్‌రెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఉద్యోగులు పరిసరాలను శుభ్రం చేశారు. కలెక్టర్ ఏఓ భారతి, డీఎంహెచ్‌ఓ, డీడీ సోషల్ వెల్ఫేర్ అనీల్‌కుమార్‌రెడ్డి, జిల్లా సర్వేయర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

సిరులతల్లి సేవలో జీయర్ స్వాములు



అమ్మవారి ఆలయం వెలుపల జీయర్ స్వాములు

తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతీ అమ్మవారిని శనివారం విజయవాడకు చెందిన అష్టాక్షరి సంపత్ కుమార్ రామానుజ జీయర్ స్వామి, కృష్ణాజిల్లాకు ఉపమాకకు చెందిన బృందావన రామానుజ జీయర్ స్వామి, కర్ణాటక మేలుకోటకు చెందిన శఠకోపముని రామానుజ జీయర్ స్వామి వారు సేవించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు మహా ద్వారం వద్ద సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పలు రైళ్లు దారి మళ్లింపు

గూడూరు రూరల్: చెన్నై– గుమ్మిడిపూండి వద్ద రైల్వే లైన్ మరమ్మతుల కారణంగా ఈ నెల 16, 19, 21 తేదీల్లో పలు రైళ్ల దారి మళ్లించనున్నట్టు గూడూరు రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నుంచి చెన్నై వెళ్లే పినాకిని ఎక్స్‌ప్రెస్ గూడూరు వరకు మాత్రమే వస్తుందని, తిరిగి సాయంత్రం గూడూరు నుంచి విజయవాడకు బయలుదేరుతుందని తెలిపారు. అదేవిధంగా మూడు రోజులపాటు చెన్నై నుంచి వచ్చే నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలు రేణిగుంట మీదుగా గూడూరుకు వస్తుందని వెల్లడించారు. ఇంకా పలు రైళ్ల దారి మళ్లించనున్నట్టు తెలిపారు.

కంచి పీఠాధిపతికి ఆహ్వానం



పీఠాధిపతిని ఆహ్వానిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 21వ తేదీ నుంచి నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారిని శనివారం ఆలయ అధికారులు ఆహ్వానించారు. ఆదిదంపతుల చిత్రపటంతోపాటు ఆహ్వానపత్రికను పీఠాధిపతికి అందించారు. ఆలయ డిప్యూటీ ఈఓ ఎన్‌ఆర్ కష్ణారెడ్డి, ప్రధాన అర్చకుడు కరుణాకరన్ గురుకుల్ పాల్గొన్నారు.

దిగుబడి



ఈ ఫొటోలో కనిపిస్తున్న పట్టాభయ్య కౌలు రైతు. వరదయ్యపాళెం మండలం యానాదివెట్టు దళితవాడకు చెందిన ఆయన 4 ఎకరాల్లో 16కి 38 సన్నరకం వరి సాగు చేశాడు. రెండు రోజుల క్రితం పంట నూర్పిడి చేయగా 68 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. సరాసరిగా ఎకరానికి 17 బస్తాలు చొప్పున చేతికందింది. ప్రస్తుతం రూ.1,700తో బస్తా అమ్ముడు పోతోంది. అయితే పంట సాగుకు ఎకరానికి రూ. 25వేల వరకు ఖర్చైంది. తనకు వచ్చిన దిగుబడిలో ఎకరానికి 6 బస్తాల కౌలుకు పోగా మిగిలిన 11 బస్తాలతో పెట్టుబడి కోసం చేసిన అప్పు ఎలా తీర్చాలో అర్థం కాని పరిస్థితి. ఎకరాకు రూ.10వేలకు పైగా చేతి నుంచి పడుతోంది. తనతో పాటు తమ ఊరిలో సాగు చేసిన 200 ఎకరాలలో ఇదే దిగుబడి వచ్చింది. ఆ రైతులది ఇదే దుస్థితి.



వరదయ్యపాళెం మండలంలో వరి పైరు కోస్తున్న యంత్రం

వరి పంటను ప్రతికూల వాతావరణం నిండా ముంచేసింది. దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. ఆరుగాల కష్టం అన్నదాతకు అప్పులనే మిగుల్చుతోంది. ఐదేళ్ల పాటు ఆదాయం అందించిన వరి సాగు ఈ ఏడాది నష్టాల బాట పడుతోంది. ప్రధానంగా కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిపోయింది. పెట్టుబడి సైతం రాకపోవడంతోపాటు రూ.10వేల వరకు అదనపు భారం పడుతోంది. కంకి దశలో కురిసిన అకాల వర్షం.. అధిక మంచు కారణంగానే ఈ దుస్థితి దాపురించిందని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధరతోపాటు పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతోంది.

నిండా మునిగిన అన్నదాతలు

- ప్రతికూల వాతావరణంతో ఆవిరైన ఆశలు
- వరి సాగులో దిగుబడి తగ్గడంతో ఎదురవుతున్న నష్టాలు
- పెట్టుబడి సైతం చేతికందక ఆందోళనలో రైతులు

వరదయ్యపాళెం: జిల్లాలో రైతులు రబీ సీజన్‌కు సంబంధించి మొత్తం 83,125 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసినప్పటికీ పంట దిగుబడి తగ్గడంతో రైతులు నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. గతంలో ఎకరానికి 32–35 బస్తాల దిగుబడి వచ్చేది. ఈ ఏడాది సకాలంలో నీరందినప్పటికీ కంకి దశలో కురిసిన అకాల వర్షం, అధిక మంచు అన్నదాతలను కోలుకోలేని దెబ్బ తీసింది. ఆ ప్రభావంతో దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది.

ఆశలపై నీళ్లు

ఈ ఏడాది నీటి వసతి బాగుండడంతో పంట పచ్చగా, ఏపుగా పెరిగింది. ఎకరాకు 30–35 బస్తాల వరకు దిగుబడి వస్తుందని రైతులు ఆశించారు. పంటను కంటికిరెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. అనూహ్యంగా కురిసిన వర్షం వారి ఆశలపై నీళ్లు చల్లింది. ప్రస్తుతానికి ఎకరానికి 20–25 బస్తాల దిగుబడి మాత్రమే వస్తోంది. సగటున 23 బస్తాలు దిగుబడి ఉంటుందని వ్యవసాయశాఖ అంచనా. ఎకరం సాగు చేసేందుకు రూ. 25వేలు వరకు పెట్టుబడుల కింద రైతులు ఖర్చు చేశారు. పెట్టుబడిపై వడ్డీ ఇందుకు అదనం. కౌలు రైతు ఎకరానికి 6 బస్తాలు కౌలు చెల్లించాల్సి ఉంది. ఈ లెక్కన ఆ రైతుకు మిగిలేది 10–15 బస్తాలు మాత్రమే.



వరదయ్యపాళెం మండలంలో వ్యాపారులు కొనుగోలు చేసిన ధాన్యం

జిల్లాలో వరి సాగు వివరాలు

సబ్ డివిజన్ పేరు	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
సత్యవేడు	9,616
గూడూరు	15,624
వెంకటగిరి	8,700
శ్రీకాళహస్తి	16,962
సూళ్లూరుపేట	11,200
తిరుపతి	2,200
నాయుడు పేట	12,023
పుత్తూరు	6,800

సాగు చేసిన రకాలు

వరి పంట	విస్తీర్ణం (హెక్టార్లలో)
ఆర్ఎన్ఆర్ (15048)	25,500
బీపీటీ (5204)	22,000
ఎంటీయూ 12 కి 71	13,000
16 కి 38 సన్నాలు	24,200

కష్టం వృథా



ఈ ఏడాది వ్యవసాయం కష్టంగా మారింది. దిగుబడి తగ్గడంతో పాటు గత ఏడాదితో పోల్చుకుంటే బస్తాకు రూ. 400 నుంచి రూ. 500 వరకు ధర కూడా తగ్గిపోయింది. అటు గిట్టుబాటు ధరలేక, ఇటు తగ్గిన దిగుబడి తీవ్రంగా నష్టాల్లో ముంచింది. నాకున్న మూడెకరాల్లో వరి పంట సాగు చేశా. 60 బస్తాల దిగుబడి వచ్చింది. ఎకరాకు రూ.25వేల చొప్పున పెట్టుబడి పోను రూ. 10వేల వరకు నష్టం వచ్చింది. మా కష్టం కూడా వృథాగా మారింది. **– గోపాల్, రైతు, కంచరపాళెం, వరదయ్యపాళెం మండలం**

ప్రభుత్వం ఆదుకోవాలి



ఈ ఏడాది 10 ఎకరాల్లో 12కి 71 సన్నరకం వరి పంట సాగు చేశా. 230 బస్తాలు దిగుబడి వచ్చింది. అయితే ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ద్వారా ధాన్యం విక్రయించలేకపోయా. బస్తా రూ. 1,600 చొప్పున ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకున్నా. ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసి ఉంటే బస్తా రూ. 1,750లకు కొనుగోలు చేసి ఉండేవారు. సకాలంలో అధికారులు స్పందించని కారణంగా బస్తాకు రూ. 150 చొప్పున నష్టపోయా. అలాగే ఈ ఏడాది దిగుబడి పూర్తిగా తగ్గిపోవడంతో 8 ఎకరాల కౌలు భూమి సాగు చేసి దెబ్బతిన్నా. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి. **– చెంచురామయ్య, రైతు, కంచరపాళెం, వరదయ్యపాళెం మండలం**

వాతావరణ పరిస్థితులే..



ఈ ఏడాది ఎక్కువ వర్షాలు, మంచు కారణంగా దిగుబడులు తగ్గాయి. అంతేకాక రైతులు భూసార పరిస్థితులను బట్టి పంటలు సాగు చేయాలి. కొత్త రకాలపై దృష్టి పెట్టడం కూడా దిగుబడి తగ్గడానికి కారణం. వరి పంట సాగు సమయంలో వ్యవసాయశాఖ అధికారుల సలహాలు తీసుకోవాలి. **– సుబ్రమణ్యం, ఏడీఏ, సత్యవేడు వ్యవసాయశాఖ డివిజన్**

బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ



ర్యాలీ నిర్వహిస్తున్న షార్ ఉద్యోగులు

సూళ్లూరుపేట: ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించి పర్యావరణాన్ని రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని షార్ డైరెక్టర్ ఏ.రాజరాజన్ పిలుపునిచ్చారు. శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆయన పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ప్లాస్టిక్ కవర్లు వాడొద్దు–గుడ్డ సంచులే ముద్దు అని నినాదాలు చేస్తే షార్ కేంద్రంలోనే కాకుండా డీఓఎస్ కాలనీ, డీఆర్‌డీఎల్ కాలనీ, కేఆర్‌పీ కాలనీల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం షార్ ఉద్యోగులంతా కలిసి తెల్లటి దుస్తులు ధరించి ఫాగింగ్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. షార్ కంట్రోలర్ వీ.శ్రీనివాసులురెడ్డి, పులికాట్ నగర్ నుంచి వీ.కృతివాసన్, పినాకినీ నగర్ నుంచి పీ.వెంకటరెడ్డి, స్వర్ణముఖినగర్ ఎస్. ముత్తు చెళియన్ పాల్గొని అవగాహన ర్యాలీలను నిర్వహించారు.



షార్‌లో ఫ్లాగింగ్ రన్ నిర్వహిస్తున్న ఉద్యోగులు

సముద్రంలోకి తాబేలు పిల్లలు



తాబేలు పిల్లలను సముద్రంలోకి వదులుతున్న సిబ్బంది

వాకాడు: వాకాడు మండలం, నవాబుపేట సముద్ర తీరంలో శనివారం ఫారెస్ట్ అధికారుల సమక్షంలో సిబ్బంది ఆలీవ్‌రిడ్లీ తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి విడిచి పెట్టారు. ఈ ఏడాది తొలుతగా నవాబుపేట వద్ద ఉన్న తాబేళ్ల పిల్లల సంరక్షణా కేంద్రం(హేచరీ)లో దాదాపు 120 గుడ్లను సేకరించి పొదిగించారు. అందులో 118 పిల్లలు ఆరోగ్యంగా బయటకు రావడంతో వాటిని పలు జాగ్రత్తలతో సముద్రంలో విడిచి పెట్టారు. మానవుని మనుగడకు ఎంతో దోహదపడే తాబేళ్లను చంపినా, వేటాడినా చట్టరీత్యా నేరమని ఫారెస్టు అధికారులు హెచ్చరించారు.

ప్రమాదరహిత డ్రైవింగ్‌కు ప్రశంసలు



ఉత్తమ డ్రైవర్లతో ఆర్టీసీ అధికారులు, ఆర్‌టీఓ మురళీకృష్ణ తదితరులు

తిరుపతి అర్బన్ : రహదారి భద్రతా మాసోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా తిరుపతి బస్టాండ్‌లో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్‌టీఓ మురళీకృష్ణ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని కోరారు. మీపై నమ్మకంతో పదుల సంఖ్యలో ప్రజలు ప్రయాణిస్తున్నట్లు గుర్తుంచుకోవాలని చెప్పారు. చిన్నపాటి ప్రమాదాలకు సైతం అవకాశం లేకుండా విధులు నిర్వర్తించిన వారిని అభినందించారు. డీపీటీఓ నరసింహులు మాట్లాడుతూ ఆర్టీసీలో సురక్షితంగా ప్రయాణించవచ్చని ప్రజలు భావిస్తారని, వారి నమ్మకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి డ్రైవర్‌పై ఉంటుందని తెలిపారు. జిల్లాలోని 11 డిపోల నుంచి 33 మంది, జిల్లా స్థాయిలో మరో ముగ్గురు డ్రైవర్లకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతి అందించారు. డీసీటీఎం విశ్వనాథం, ఏటీఎం డీఆర్ నాయుడు, డీఎంలు బాలాజీ, భాస్కర్‌రావు, హరిబాబు, మునిచంద్ర, పీఓ షహజాద్ పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది

ఆర్టీసీలో 34 ఏళ్ల క్రితం చేరా. ఇప్పటి వరకు నా సర్వీస్‌లో చిన్నపాటి ప్రమాదం కూడా చేయలేదు. దేవుడు తోడుగా ఉన్నాడని భావిస్తున్నా. బాధ్యతగా డ్రైవింగ్ చేయడంతోపాటు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తా. మా సేవలను ఆర్టీసీ పెద్దలు గుర్తించి సన్మానం చేయడం సంతోషంగా ఉంది. **– కేవీ సుధాకర్, డ్రైవర్, సత్యవేడు డిపో**

బాధ్యతగా విధులు

ఆర్టీసీలో 33 ఏళ్లుగా పనిచేస్తున్నా. బాధ్యతగా విధులు నిర్వర్తిస్తున్నా. భగవంతుడి ఆశీస్సులతో ఇప్పటి వరకు చిన్నపాటి ప్రమాదం కూడా చేయలేదు. డ్రైవర్లు డ్యూటీపైనే దృష్టి పెట్టాలి, ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలి. మా సేవలను అధికారులు గుర్తించడం మా బాధ్యతను మరింత పెంచింది. **– బి.కృష్ణ, డ్రైవర్, పుత్తూరు డిపో**

అధికారమే అండగా చంద్రగిరిలో నియోజకవర్గ ముఖ్య నేత రెచ్చిపోతున్నారు. స్వర్ణముఖి నదినే ఆదాయ వనరుగా మార్చుకుని హల్‌చల్ చేస్తున్నారు. ప్రైవేట్ సైన్యం ఏర్పాటు చేసుకుని మాఫియాను నడిపిస్తున్నారు. యథేచ్ఛగా ఇసుకను జేసీబీలతో తవ్వేసి అక్రమంగా తరలించేస్తున్నారు. ప్రశ్నించిన వారిని భయపెట్టి గొంతునొక్కేస్తున్నారు. అధికారులను గుప్పిట్లో పెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అడ్డు వచ్చిన సొంత పార్టీ నేతలను కూడా వేధింపులకు గురిచేస్తున్నారు. ఇసుక స్మగ్లింగ్‌లోకి దిగిన కేవలం రెండు నెలల్లోనే సుమారు రూ.4కోట్ల వరకు వెనకేసుకున్నట్లు ఆ పార్టీ వారే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు.

2 నెలలు.. రూ.4కోట్లు!



రెడ్డివారిపల్లె వద్ద స్వర్ణముఖి తీరంలో డంప్ చేసిన ఇసుక

చంద్రగిరిలో రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

- స్వర్ణముఖిని చెరబట్టిన స్థానిక ప్రజాప్రతినిధి
- పగటిపూట తవ్వకం.. రాత్రివేళ యథేచ్ఛగా తరలింపు



ట్రాక్టర్‌లో ఇసుకను లోడ్ చేస్తున్న దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : 'ఇసుక మాఫియా ఆగడాలు అరికడతాం. మట్టి అక్రమ రవాణాను అడ్డుకుంటాం. బెల్టు షాపులు నివారిస్తాం..' అంటూ నీతులు చెప్పే సీఎం చంద్రబాబు తన సొంత ఊర్లో పరిస్థితిని చక్కదిద్దలేకపోతున్నారు. నియోజకవర్గ ముఖ్యనేత కనుసన్నల్లో చంద్రగిరి సమీపంలోని స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతంలో ఇసుక మాఫియా చెలరేగిపోతున్నా అరికట్టలేకపోతున్నారు. ఇంట గెలిచి రచ్చ గెలువు అన్న పెద్దల మాట ప్రకారం ఆయన తన ఊర్లోనే పరిస్థితిని చక్కదిద్దలేనప్పుడు ఇక రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ప్రజాప్రతినిధి అండతోనే!

అధికార పార్టీలోని వారిని కూడా ఆ ముఖ్యనేత టార్గెట్ చేస్తున్నట్లు ఆ పార్టీ నాయకులే ఆరోపిస్తున్నారు. ఆయనను కాదని ఇసుకను తరలిస్తే వెంటనే పోలీసులు, రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగుతున్నారని, దీన్ని బట్టి ఆయన ఏ స్థాయిలో అధికారులను తన చేతిలో పెట్టుకున్నారో అర్థమవుతోందని విమర్శిస్తున్నారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన తమను ఇప్పుడు టార్గెట్ చేయడం దారుణమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ నేత ఆగడాలపై సీఎం చంద్రబాబుకు సైతం పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం. ఇసుకను తరలించి వాటాలు గుంజుకుంటున్నట్టు పెద్ద ఎత్తున చర్చసాగుతోంది.

రెచ్చిపోతున్న ఇసుక తోడేళ్లు

రెడ్డివారిపల్లె సమీపంలోని వాగులో రెండు జేసీబీలతో ఇసుకను తోడేస్తున్నారు. పగలంతా వాహనాలు బయటకు రాకుండా జేసీబీల ద్వారా తవ్వి, తమకు అనుకూలమైన ప్రాంతాల్లో డంపు చేసుకుంటున్నట్లు సొంత పార్టీ నేతలే ఆరోపిస్తున్నారు. రాత్రుల్లో 12 యూనిట్ల సామర్థ్యం ఉన్న ఐదు టిప్పర్లు, మరో 10 ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని వెల్లడిస్తున్నారు.

గంజాయి బ్యాచ్‌తో గస్తీ

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఆ ముఖ్యనేత అండతో ఆయన బినామీలు ఓ ప్రత్యేకమైన గ్రూపును తయారు చేసుకున్నట్లు తెలిసింది. సుమారు 15 మంది వరకు గంజాయికి అలవాటు పడిన యువకులను స్వర్ణముఖి నది వద్ద గస్తీకి ఏర్పాటు చేసుకున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రుల్లో ఇసుకను తోడే సమయంలో ఎవరైనా అడ్డొస్తే ఆ గంజాయి బ్యాచ్ దౌర్జన్యానికి పాల్పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ మద్యం బాటిళ్లను పొలాల్లో పడేయడం, గంజాయి సేవించి కేకలు వేస్తుండడంతో రైతులు సైతం ఆందోళనకు లోనవుతున్నారు. దీనిపై ప్రశ్నిస్తే గంజాయి బ్యాచ్ దారుణంగా దాడి చేస్తోందని వాపోతున్నారు.

అధికారుల ఉదాసీనత

రెడ్డివారిపల్లె సమీపంలోని స్వర్ణముఖి నది నుంచి రూ.కోట్ల విలువైన ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. పోలీసుల కళ్లెదుటే భారీ వాహనాల్లో ఇసుక తరలిపోతున్నా అడ్డుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులు సైతం చర్యలు తీసుకోకపోవడం వెనుక ముడుపులే కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలుస్తోంది.

నెలకు రూ.2.07 కోట్ల ఆదాయం


ఒక టిప్పర్ లోడు 12 యూనిట్లు కాగా, యూనిట్ ధర రూ.1,500 నుంచి రూ.1800 వరకు వసూలు చేస్తున్నారు. ఒక ట్రాక్టర్ లోడ్ రూ.1,200 నుంచి రూ.1,500 వరకు తీసుకుంటున్నారు. స్వర్ణముఖిలో 10 ట్రాక్టర్లు, 5 టిప్పర్లలతో ఇసుక దందా సాగిస్తున్నారు. రోజుకు ఒక్కో ట్రాక్టర్ పది ట్రిప్పుల వరకు తరలిస్తున్నారు. 10 ట్రాక్టర్లలో మొత్తం 100 ట్రిప్పులు రవాణాకు రూ.1.5 లక్షల వరకు ఆర్జిస్తున్నారు. రోజుకు ఒక్కో టిప్పర్ 5 ట్రిప్పులుగా తరలిస్తున్నారు. 5 టిప్పర్లు కలిపి 25 ట్రిప్పులు రవాణాకు రూ.5.40 లక్షల వరకు అక్రమంగా సంపాదిస్తున్నారు. నెలవారీగా ట్రాక్టర్ల ద్వారా రూ.45 లక్షలు, టిప్పర్ల ద్వారా రూ.1.62కోట్లు వెనకేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కన నెలకు సుమారు రూ. 2.07కోట్లకు పైగానే ఇసుక నుంచి పిండుకుంటున్నట్లు సమాచారం. ఇందులో కొంత భాగం ప్రజాప్రతినిధి, అధికారులకు వెళుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తుండడం గమనార్హం. ఒక్క చంద్రగిరి మండలంలోనే ఇసుక అక్రమ రవాణాలో నెలకు రూ.2కోట్లకు పైగా ఆదాయం రాగా.. ఇక నియోజకవర్గంలోని మిగిలిన మండలాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ఇట్టే ఊహించవచ్చు.

పలు ప్రాంతాల్లో డంప్‌లు

ఇసుక మాఫియా నడిపిస్తున్న సదరు ముఖ్యనేత పలు ప్రాంతాల్లో ఇసుకను డంప్ చేయిస్తున్నట్లు ఆ పార్టీ నేతలే వెల్లడిస్తున్నారు. రెడ్డివారిపల్లి స్వర్ణముఖి నది వంతెన సమీపంలోని ఓ మామిడి తోట, మిట్టపాళెం వద్ద రోడ్డుకు ఆనుకుని రెండు డంపింగ్ పాయింట్లును ఏర్పాటు చేసుకుని కాసులు దండుకుంటున్నట్లు వివరిస్తున్నారు.



శ్రీనివాసమంగాపురం మార్గంలోని వంతెన వద్ద ఓ మామిడి తోటలో ఇసుక డంప్



మిట్టపాళెం మార్గంలో రోడ్డు పక్కనే డంప్



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.87,550
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.7,890

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.98,500
రిటైల్ వెండి గ్రాము	రూ.101.50

క్లుప్తంగా

టీటీడీ అధికారులను విచారిస్తున్న సిట్ బృందం

తిరుమల: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో వినియోగించే నెయ్యిలో కల్తీ జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో ఇటీవల పలు సంస్థలకు చెందిన యజమానులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం తిరుపతిలో టీటీడీకి చెందిన పలువురు అధికారులను, సిబ్బందిని సిట్ బృందం ఆధారాల కోసం విచారించినట్లు తెలుస్తోంది.

శ్రీవారి సేవలో సిలికాన్ ఎండీ

తిరుమల: తిరుమల శ్రీవారిని శనివారం సిలికాన్ గ్రూప్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గురుస్వామినాయుడు దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానంతరం టీటీడీ అధికారులు ఆయనకు శ్రీవారి ప్రసాదాలను అందజేశారు.



శ్రీవారి ఆలయం వెలుపల గురుస్వామినాయుడు

సర్వదర్శనానికి 8గంటలు

తిరుమల: తిరుమలలో రద్దీ సాధారణంగా ఉంది. 8 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. శనివారం శ్రీవారి సర్వదర్శనానికి సుమారు 8గంటల సమయం పడుతోందని టీటీడీ అధికారులు వెల్లడించారు. ఈక్రమంలో శుక్రవారం అర్ధరాత్రి వరకు 64,527మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 23,129మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. శ్రీవారికి హుండీ ద్వారా రూ.3.70 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

హెల్మెట్ వాడకంపై ర్యాలీ

తిరుపతి అర్బన్: హెల్మెట్ వాడకంపై పోలీసులు శనివారం తిరుపతి ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. అందులో భాగంగానే శనివారం హెల్మెట్ వాడకంపై తిరుపతి నగరంలో పోలీసులు ర్యాలీ చేపట్టారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

శ్రీకాళహస్తి : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాసా గార్డెన్ బాలికల గురుకులం ప్రిన్సిపల్ పి.మాధవీలత తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ అర్హతగల ఐదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు మార్చి 6వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత శాతం మేరకు అడ్మిషన్లు ఉంటాయని వివరించారు.



మాధవీలత, ప్రిన్సిపల్

మమ్మీడాడీ త్వరగా వచ్చేయండి!



ధ్వంసమైన కారులో దంపతుల మృతదేహాలు



ప్రమాదంలో పూర్తిగా దెబ్బతిన్న కారు

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

- సాఫ్ట్‌వేర్ దంపతులు దుర్మరణం
- తల్లడిల్లిన ఒక్కగానొక్క కుమారుడు

పెళ్లకూరు: విధి ఎంత విచిత్రమైనదో ఈ ఘటన చూస్తే అర్థమవుతోంది. సరిగ్గా గంట ముందు కుమారుడితో ముచ్చటించిన ఆ దంపతులు తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో విగత జీవులుగా మారిపోయారు. ఈ ఘటన శనివారం స్థానికంగా విషాదాన్ని నింపింది. 71వ నంబర్ జాతీయ రహదారి మార్గం దొడ్లవారిమిట్ట గ్రామం వద్ద ఆగి ఉన్న లారీని తిరుమల నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న గాను మాధవకృష్ణ(48), పొక్కల సరితసుమంగళి(43) అనే సాఫ్ట్‌వేర్ దంపతులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. పోలీసుల కథనం.. హైదరాబాద్‌లోని అంజనేయనగర్ ప్రాంతానికి చెందిన మాధవకృష్ణ, సరితసుమంగళి అదే పట్టణంలోని ఓ ప్రయివేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలుగా పనిచేస్తున్నారు. దైవదర్శనం కోసం దంపతులిద్దరూ మూడు రోజుల కిందట కారులో బయల్దేరి శుక్రవారం అరుణాచలం గిరి ప్రదర్శన చేసుకున్నారు. అదే రోజు రాత్రి తిరుమలకు చేరుకొని శనివారం తెల్లవారు జామున తిరుమలేశుని దర్శించుకొని మధ్యాహ్నం తిరిగి హైదరాబాద్‌కు కారులో బయల్దేరారు. మార్గం మధ్యంలో దొడ్లవారి మిట్ట గ్రామం వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి అతి వేగంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో కారు ముందు భాగం లారీ కిందకు దూసుకెళ్లింది. సాఫ్ట్‌వేర్ దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, ఎస్‌ఐ నాగరాజు తమ సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. కారును స్థానికుల సహాయంతో అతి కష్టం మీద బయటకు తీశారు. కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను వెలికి తీశారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కన్నీరు తెప్పించిన కుమారుడి మాటలు

తిరుమలలో శనివారం స్వామివారిని దర్శించుకున్న మాధవకృష్ణ, సరితసుమంగళి దంపతులకు మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కుమారుడు నిషాంత్ ఫోన్ చేశాడు. మమ్మీడాడీ త్వరగా వచ్చేయండి అంటూ మాట్లాడినట్లు ఫోన్‌లో బోరున విలపించాడు. దంపతులకు ఒకే ఒక కుమారుడు నిషాంత్ 9వ తరగతి చదువుతున్నాడు. ఎక్కడికి వెళ్లాలన్నా ముగ్గురూ కలిసే వెళ్లేవారు. అయితే దూర ప్రయాణం కావడం, ప్రస్తుతం పరీక్షల సమయం దగ్గర పడుతుండడం వల్ల కుమారుడు నిషాంత్‌ను ఇంటి వద్ద వదిలిపెట్టి, భార్యాభర్తలిద్దరూ దైవదర్శనానికి బయల్దేరినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో గంట కిందటే కుమారుడు ఫోన్ చేసి మాట్లాడినట్లు బోరున విలపించాడు.

కొనసాగుతున్న వేతన వెతలు!

తిరుపతి సిటీ : వేతనాల కోసం ఆరు నెలలుగా అగచాట్లు పడుతున్నామని ఎస్వీయూ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు జీతం వేస్తారో తెలియక నానా అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. ఇష్టారాజ్యంగా రెండు నెలలకు ఒకసారి వేతనాలు చెల్లిస్తూ తమతో ఆడుకుంటున్నారని మండిపడుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు అందిస్తామని కూటమినేతలు ఊదరగొట్టి.. ఇప్పుడు ముఖం చాటేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జనవరి వేతనమే ఇప్పటి వరకు జమ చేయలేదని, దీంతో కుటుంబ పోషణ కూడా కష్టంగా మారిందని ఉద్యోగులు, పెన్షనర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో వర్సిటీ నాన్ టీచింగ్ అసోషియేషన్ నేతలు శనివారం నిరసన తెలిపారు. అనంతరం రిజిస్ట్రార్ భూపతినాయుడుకు వినతిపత్రం అందంచారు. సంఘం అధ్యక్షుడు గుర్రంకొండ శ్రీధర్, కార్యదర్శి సుబ్రమణ్యం మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీలోపు వేతనాలు చెల్లించకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఆరునెలలుగా సకాలంలో జీతాల కోసం పలుమార్లు విన్నవించుకున్నా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. జనవరి జీతాలనే ఇప్పటివరకు చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం, వర్సిటీ అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా ఎంతో మంది ఉద్యోగులు తమ కుటుంబ అవసరాలు తీర్చుకునేందుకు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 18 లోపు జీతాలు చెల్లించకపోతే, 19వ తేదీ నుంచి వర్సిటీ ఏడీ బిల్డింగ్ ఎదుట ఉదయం 10.30 నుంచి 11గంటలవరకు ప్రతి రోజూ నిరసన తెలుపుతామని స్పష్టం చేశారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణకు దరఖాస్తులు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ లైవ్లీహుడ్ బిజినెస్ ఇంక్యుబేటర్ సెంటర్‌లో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణకు ఆసక్తిగల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కో–ఆర్డినేటర్లు ప్రొఫెసర్ జీవనజ్యోతి, సావిత్రి, సుజాతమ్మ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ మూడు నెలల కాలవ్యవధిగల ఈ శిక్షణ ఫిబ్రవరి చివరి వారం నుంచి ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9885244006 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వీవీ నగర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

తిరుపతి రూరల్: తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వీవీనగర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం బయటపడడంతో ఆ ప్రాంత వాసులు భయాందోళనకు గురయ్యారు. వీవీనగర్ శివార్లలోని మురుగునీటి గుంతలో మృతదేహం పడుండటాన్ని శనివారం సాయంత్రం స్థానికులు గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. తిరుచానూరు ఎస్‌ఐ జగన్నాథం తన సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 40 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తిగా గుర్తించారు. మద్యం మత్తులో అటుగా వెళ్లి బురదలో పడి చనిపోయి ఉండొచ్చని ప్రాథమికంగా నిర్ధారించారు. కాగా అతని శరీరంపై బట్టలు కూడా లేకపోవడంతో ఎటువంటి ఆధారాలు లభించలేదు. దీంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాబుకు తప్ప.. భయపడం

వరదయ్యపాళెం : ''నాది తప్పులు చేసే వ్యక్తిత్వం కాదు. ప్రజలకు సేవ చేసే మనస్తత్వం. అధికార పార్టీలోనే ఉంటూ కొందరు కుట్రలు చేస్తున్నారు. అలాంటి స్వార్థ పరులను పట్టించుకోను. సీఎం చంద్రబాబు తప్ప వేరేవాళ్లకు భయపడే ప్రసక్తే లేదు'' అని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం చేశారు. శనివారం వరదయ్యపాళెం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలోని స్థానికేతరులు కొందరు అధికార పక్షంగా చెప్పుకుంటూ పెత్తనం చేసేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇన్‌చార్జి పదవి కోసం నీచ రాజకీయాలకు తెగబడున్నారని ఆరోపించారు. దళిత ఎమ్మెల్యేను అని కూడా చూడకుండా దిగజారుడుగా ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని నా పక్కన ఉన్న నేతలు కూడా ఖండించకపోవడం దురదృష్టకరమన్నారు. నేతలపై నమ్మకంతోనే ఖాళీ లెటర్ హెడ్‌లపై సంతకం చేసి ఇస్తున్నానని వెల్లడించారు. అయినప్పటికీ నాతో తిరిగే నేతలు కృతజ్ఞతాపూర్వకంగా వ్యవహరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నం పెట్టే తల్లులతో వివాహేతర సంబంధాలు అంటగట్టడమే కాకుండా, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉత్తరాలు రాయడం సమజసం కాదని స్పష్టం చేశారు. ఒక్క సత్యవేడు నియోజకవర్గంలోనే ఈ కుట్రల సంస్కృతి పెరిగిపోయిందని మండిపడ్డారు. అయితే వారి తాటాకు చప్పుళ్లకు తాను భయపడనని వెల్లడించారు.



అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే ఆదిమూలం

అందరి సహకారంతో 'స్వచ్ఛాంధ్ర'



పారిశుద్ధ్య కార్మికులకు కిట్ అందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): జిల్లావ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌ను అన్ని వర్గాల ప్రజలు, నేతలు, సంస్థలను భాగస్వామ్యం చేసి అందరి సహకారంతో విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శనివారం రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామనగర్‌లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలకు వర్మీకంపోస్టు అందజేశారు. పారిశుద్ధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లకు కిట్‌లు అందించి, సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. త్వరలోనే ప్రతి ఇంటికీ రెండు డస్ట్‌బిన్‌లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తడి, పొడి చెత్తను కలపకుండా వేర్వేరుగా అందించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేకుంటే దోమలు వ్యాప్తిం చెంది మలేరియా, డెంగీ, టైఫాయిడ్ జ్వరాలు ప్రబలుతాయని వివరించారు. కార్యక్రమంలో డీపీఓ సుశీలాదేవి, డీఎల్‌పీఓ ప్రభురెడ్డి, ఎస్‌డబ్ల్యూపీసీ కో–ఆర్డినేటర్ శిరీష, జిల్లా రిసోర్స్ పర్సన్ భరత్‌కుమార్, ఎంపీడీఓ విష్ణు చిరంజీవి, తహసీల్దార్ సురేష్ బాబు, ఈఓపీఆర్‌డీ ప్రభురావు, కార్యదర్శి రమేష్‌బాబు, సర్పంచ్ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీపై ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో ఈనెల 20వ తేదీ (గురువారం) నుంచి 30 రోజుల పాటు మహిళలు, పురుషులకు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ పీ.సురేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన మహిళలు అర్హులని తెలిపారు. కనీసం విద్యార్హత 10వ తరగతి చదువుకుని ఉండాలని సూచించారు. శిక్షణ సమయంలో ట్రైనీస్‌కి ఉచిత భోజనం, రాను పోను ఒక్కసారి చార్జీ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి వారి పేరు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11–48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి. ఫోన్: 79896 80587, 94949 51289 సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎవరే అతగాడు?

- తనను ఎవరో చంపేందుకు యత్నిస్తున్నారని ఓ వ్యక్తి హల్‌చల్
- పీలేరు– తిరుపతి బస్సులో వస్తూ.. భాకరాపేట వద్ద దిగేసిన వైనం
- అడవిలోకి పారిపోయిన వ్యక్తి ఆచూకీ కోసం పోలీసుల విఫలయత్నం

చంద్రగిరి : ''నన్ను చంపేందుకు కొందరు వెంటాడుతున్నారు. దొరికితే కచ్చితంగా ప్రాణం తీసేస్తారు'' అంటూ శుక్రవారం అర్ధరాత్రి పీలేరు నుంచి తిరుపతి వస్తున్న కర్ణాటక బస్సులో ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. భాకరాపేట కనుమ వద్దకు రాగానే కేకలు వేసి బస్సు ఆపించి దిగేశాడు. అడవిలోకి కేకలు వేస్తూ పరుగులు తీశాడు. ఈ క్రమంలో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. దట్టమైన అటవీప్రాంతంలో బస్సు నిలిపిన డ్రైవర్‌పై మండిపడ్డారు. అనంతరం బస్సు ఏ.రంగంపేటకు చేరుకోగానే పోలీసులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో పోలీసులు వెంటనే భాకరాపేట ఘాట్‌రోడ్డుకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. చిమ్మ చీకట్లో అజ్ఞాత వ్యక్తి ఆచూకీ దొరకలేదు. దీంతో అటువైపుగా వచ్చిన వాహనదారులను ఆపి ఎవరైనా దారిలో తారసపడ్డారా అని ఆరా తీశారు. శనివారం కూడా గాలింపు కొనసాగించినా ప్రయోజనం లేకపోవడంతో తిరుగుముఖం పట్టారు. ఏదిఏమైనా ప్రాణభయంతో పరుగులు తీసిన వ్యక్తి ఆచూకీని పోలీసులు కనిపెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదాలకు దూరం ఉందాం

తిరుపతి అర్బన్: ప్రతి ఒక్కరూ భద్రతా నిబంధనలు పాటిద్దాం.. ప్రమాదాలకు దూరంగా ఉందామని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ పిలుపునిచ్చారు. జనవరి 16 నుంచి ప్రారంభించిన రోడ్డు భద్రతా మాసోత్సవాలు శనివారంతో ముగించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ముగింపు సభను రవాణాశాఖ వారి నేతృత్వంలో చేపట్టారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు మెమెంటోలు జారీ చేశారు. జేసీ మాట్లాడుతూ ప్రాణం చాలా విలువైనదని, డ్రైవింగ్ సమయంలో నిర్లక్ష్యం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ప్రమాద సమయంలో గోల్డెన్ హవర్‌లో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.5వేలు ప్రోత్సాహాన్ని గుర్తుచేశారు. అనంతరం ఆర్టీవో మురళీమోహన్ రోడ్డు ప్రమాదల నివారణకు తీసుకోవాల్సిన అంశాలనువివరించారు. డీపీటీఓ నరసింహులు, రవాణాశాఖ మోటార్ వాహన తనిఖీ అధికారులు సుబ్రహ్మణ్యం, మోహన్‌కుమార్, అంజనేయప్రసాద్, వెంకటరమణ నాయక్, అంజనేయవర్మ, రోడ్ సేఫ్టీ లాయర్ బాలాజీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.



జాయింట్ కలెక్టర్ నుంచి జ్ఞాపిక అందుకుంటున్న విద్యార్థులు